క్లుప్తంగా

క్యాలెండర్, డైరీల ఆవిష్కరణ



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న మాజీ సీఎం వైఎస్ జగన్

పులివెందుల రూరల్ : పట్టణంలోని భాకరాపురంలోని క్యాంపు కార్యాలయంలో గురువారం మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ నూతన క్యాలెండర్లను, డైరీలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర నాయకులు సి.కె.వెంకటనాథ్‌రెడ్డి, జి.సురేష్‌రెడ్డి, జగన్‌రెడ్డి, వైఎస్సార్‌టీఎఫ్ జిల్లా నాయకులు ఎస్.అమర్నాథ్‌రెడ్డి, పి.వెంకటరెడ్డి, జి.ఓబుల్‌రెడ్డి, కె.ప్రభాకర్‌రెడ్డి, వి.వి.పవన్, ఎస్.మదార్‌వల్లి, పద్మనాభరెడ్డి, మండల నాయకులు పాల్గొన్నారు.

కంపచెట్ల తొలగింపు



కంపచెట్లను తొలగిస్తున్న జేసీబీ

లింగాల : కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి చొరవతో లింగాల ఎస్సీ కాలనీలో కంపచెట్ల తొలగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాతిరెడ్డిపల్లెలో పర్యటించినప్పుడు ఎస్సీ కాలనీ ప్రజలు బస్టాండు సమీపంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసేందుకు తరలివచ్చారు. ఈ సందర్భంగా వారు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డితో కాలనీలోని సమస్యలను వివరించారు. కాలనీ పక్కనే కంపచెట్లు భారీగా పెరిగిపోయి విష కీటకాలు, అడవి జంతువులు కాలనీలోకి ప్రవేశించి కాలనీ వాసులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని విన్నవించుకున్నారు. దీనికి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి స్పందిస్తూ జేసీబీని పంపిస్తాను, కంపచెట్లను తొలగించుకోండంటూ హామీ ఇచ్చారు. దీంతో గురువారం జేసీబీతో కంపచెట్లు తొలగించారు. కాలనీ వాసులు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలి

జమ్మలమడుగు : మున్సిపల్ కార్మికులకు సంబంధించిన సమస్యలను వెంటనే కూటమి ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ మున్సిపల్ విభాగ అధ్యక్షుడు బి.నాగన్న, కార్యదర్శి శేఖర్‌లు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక పాత బస్టాండ్‌లో ఉన్న మస్టర్ పాయింట్ వద్ద పారిశుద్ధ్య కార్మికులతో కలసి వారు నిరసన తెలిపి మాట్లాడారు. మున్సిపల్ పరిధిలో పని చేస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రతతోపాటు జీతాలు పెంచాలంటూ గతంలో నిరసన చేపట్టడం జరిగింది. దీంతో గత ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు వేతనాలు పెంచుతామంటూ జీవోలను విడుదల చేసింది. ఎన్నికల సమయంలో ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం కూడా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి ఏడు నెలలవుతున్నా మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించలేదన్నారు.

భూ సమస్యలను పరిష్కరించుకోండి

వల్లూరు (చెన్నూరు) : చెన్నూరులో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో కడప రెవెన్యూ డివిజనల్ అధికారి జాన్ ఎర్విన్ పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా అధికారులే గ్రామాలలోకి వచ్చి భూ సమస్యలను పరిష్కరిస్తారన్నారు. రైతులు తమ సమస్యలను అర్జీల ద్వారా రెవెన్యూ సదస్సులో అధికారులకు ఇవ్వాలన్నారు. ఇచ్చిన అర్జీలను పరిశీలించి 45 రోజుల్లో పరిష్కారం అయ్యే విధంగా చూస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సరస్వతి, ఆర్‌ఐ కౌశిక్, సర్వేయర్ సోమశేఖర్, వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా నేడు ర్యాలీ, ధర్నా

జమ్మలమడుగు రూరల్ : కూటమి ప్రభుత్వం ప్రజలపై మోపిన విద్యుత్ చార్జీల భారాన్ని తగ్గించాలని వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పట్టణంలో శుక్రవారం ర్యాలీ, ధర్నా నిర్వహిస్తున్నట్లు పార్టీ కార్యాలయ కార్యదర్శి సీతరాముడు ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో జరుగనున్న ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హజరు కావాలని పిలుపునిచ్చారు. ఉదయం 9.30 గంటలకు పట్టణంలోని సాయిరాం సినిమా హాల్ దగ్గరలో ఉన్న దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద నుంచి ర్యాలీ మొదలవుతుందన్నారు.

వైఎస్సార్ విగ్రహం వద్ద టీడీపీ బ్యానర్‌ను తొలగించాలని వినతి

పట్టణంలోని సాయిరాం థియేటర్ వద్ద ఉన్న దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి అనుకుని కట్టిన కూటమి బ్యానర్‌ను శుక్రవారం ఒక్క రోజు తొలగించాలని మున్సిపల్ కమిషనర్‌కు, డీఎస్పీ కె.వెంకటేశ్వరరావుకు వైఎస్సార్‌సీపీ కార్యాలయ కార్యదర్శి సీతరాముడు విజ్ఞప్తి చేశారు.

గొర్రెల మందను ఢీకొన్న టిప్పర్

ముద్దనూరు : మండలంలోని ఓబుళాపురం గ్రామ సమీపంలో గురువారం రాత్రి టిప్పర్ గొర్రెల మందను ఢీకొంది. రెండు గొర్రెలు మృతి చెందగా మరి కొన్ని గొర్రెలు గాయపడ్డాయి. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సమాచారం సేకరించారు.

కార్తెలూ పాయె.. తుపానులూ పాయె

- నిండని చెరువులు కుంటలు
- ఎండి పోయిన బోర్లు
- నిమ్మ, మామిడి చెట్లను బతికించుకునేందుకు అన్నదాతల పాట్లు
- ట్యాంకర్లతో నీళ్లు తోలుతున్న రైతన్నలు

వర్షాలు బాగా పడతాయని అన్నదాతలు నమ్ముకుని ఉన్న అన్ని కార్తెలు దాటి పోయాయి. ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేసి అప్రమత్తంగా ఉండాలని చెప్పిన అన్ని తుపానులు పోయాయి. వరుణ దేవుడు మాత్రం రైతన్నల ఆశలపై ఇంటి ముంగిట కల్లాపి చల్లినట్లుగా అరకొరగా కురిసి ఇక ఇంతే అన్నట్లుగా ముఖం చాటేశాడు. మేఘాలు మాత్రం ఊరించి దోబూచులాడుతున్నాయి. చివరకు వాగులు వంకల్లో సైతం గువ్వలు తాగడానికి కూడా గుక్కెడు నీళ్ల లేవు. భూగర్భ జలాలు అడుగంటి పోయి బోర్లు ఎండి పోయాయి. నిమ్మ, మామిడి తోటలు వాడు ముఖం పట్టాయి. రైతు కళ్లల్లో నీళ్ల కమ్మాయి. చెట్లను బతికించుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నాడు. ట్యాంకర్లతో నీళ్ల కొని నిమ్మ, మామిడి చెట్లకు తోలుకొంటూ ఇబ్బందులు పడుతున్నారు. చక్రాయపేట మండలం కరువుకు నిలయంగా మారిందన దానికి సజీవ సాక్ష్యం.



నిమ్మ చెట్లకు ట్యాంకరుతో నీళ్లు పెడుతున్న రైతులు

చక్రాయపేట : చక్రాయపేట మండలంలో రైతన్నలకు ప్రధాన ఆదరవు నిమ్మ, మామిడి తోటలే కుటుంబ పోషణ. పిల్లల చదువులు, వైద్యం, అన్నింటికీ వీటి వల్ల వచ్చే ఆదాయమే దిక్కు కావడంతో రైతన్నలు వీటిని చంటి బిడ్డల్లా కాపాడుకుంటూ వస్తున్నారు. ఇప్పటికే సత్తువలు, తెగుళ్ల నివారణల నిమిత్తం లక్షలాది రూపాయలు ఖర్చు పెట్టారు. ఇంత చేశాక చెట్లు కళకళ లాడుతుండటంతో రైతుల కళ్లలోనూ ఆనందం కనిపించేది. ఇలాంటి సమయంలో వరుణ దేవుడు కక్ష గట్టడంతో రైతన్నల ఆశలన్నీ ఆవిరి అయ్యాయి. దీంతో దిక్కు తోచని రైతన్నలు దిక్కుతోచక అల్లాడి పోతున్నారు. జగనన్న ప్రభుత్వ హయాంలో రైతులకు సంక్షేమ పథకాల ద్వారా కాస్తో కూస్తో లబ్ధి కలుగు తుండేది. ఈ ప్రభుత్వం వచ్చాక అది కూడా లేకుండా పోయిందని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ట్యాంకరు నీళ్ల రూ.800

నిమ్మ, మామిడి తోటలు ఎండు ముఖం పడుతుండటంతో దిక్కుతోచని రైతులు ఎలాగైనా వాటిని బతికుంచుకోవాలని తాపత్రయపడుతున్నారు. వ్యవ ప్రయాసలకు ఓర్చి ట్యాంకరు నీటిని రూ.800 పెట్టి కొనుగోలు చేసి చెట్లకు నీరు అందిస్తున్నారు. ఒక ట్యాంకు నీళ్ల 8 నుంచి 10 చెట్లకు సరిపోతాయని వంద చెట్లు ఉన్న రైతులు 10 నుంచి 12 ట్యాంకర్ల నీళ్ల కొంటే ఒక తడి నీళ్ల (అది కూడా అరకొరగానే)అందిస్తున్నామని రామయ్య అనే రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కువ చెట్లు ఉంటే ఇంకా ఎక్కువ ట్యాంకర్లు కొనాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. ఇలా వారానికి ఒక తడి నీళ్ల ట్యాంకర్లతో తోలేందుకు రూ.10 వేలు ఖర్చు అవుతోందన్నారు.

కాలేటి వాగు పూర్తయి ఉంటే

చక్రాయపేట మండలంలో అన్ని చెరువులకు ఎత్తి పోతల ద్వారా నీటిని నింపి ప్రతి ఎకరాకు సాగు నీరు అందించి రైతుల కళ్లలో ఆనందం చూడాలని గత ముఖ్యమంత్రి జగనన్న భావించారు. కాలేటి వాగుకు కృష్ణా జలాలతో నింపేందుకు ప్రాజక్టు సామర్థ్యాన్ని 0.25 టీఎంసీల నుంచి 1.25 టీఎంసీలకు పెంచి సుమారు రూ.2వేల కోట్లు నిధులు మంజూరు చేశారు. దీంతో ప్రాజెక్ట్ పనులు సుమారు 70 శాతం పైగా పూర్తయ్యాయి. ఇంతలో ఎన్నికలు రావడం ప్రభుత్వం మారడంతో ప్రాజెక్ట్ పనులు ఆగిపోయాయి. జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి అయి ఉంటే ఈపాటికి పనులు పూర్తయి ప్రాజక్టుతో పాటు చెరువులు, వాగులు నీటితో కళకళ లాడుతుండేవని రైతన్నలు అంటున్నారు.



ఓబుళ నాయుని పల్లె వద్ద ఎండి పోయిన బోరు



పనులు ఆగిపోయిన కాలేటి వాగు ప్రాజక్టు



చుక్కనీరు లేని ఉప్పర్ల కుంట చెరువు

భయమేస్తోంది..



బోర్లలో నీళ్ల రాలేదు, ట్యాంకర్లతో తోలుకుంటు చెట్లను బతికించుకుంటున్నాం. ఎక్కడ చూసినా ఈ సమయానికి చెరువులు, వంకల్లో నీళ్ల నిండుగా ఉండాలి. ఇక్కడ మాత్రం చుక్క నీళ్ల కూడా లేవు. ఇంక వానలు పడి వంకలు పారతాయని నమ్మకం కూడా లేదు. రేపు ఎండల కాలం వస్తే ఎట్లా ఉంటుందో అని భయమేస్తోంది.

– సయ్యద్ పీరాం సాహెబ్, వీరనారాయణపల్లె.

ఎన్ని అగచాట్లు పడ్డానో



నాకు ఉన్న 40 నిమ్మ చెట్లను బతికించుకునేందుకు ఎన్ని అగచాట్లు పడ్డానో భగవంతుడికే ఎరుక. ఇరుగు పొరుగు రైతులు సహకరించడంతో గట్టెక్కాను. అయితే వానలు పడలేదు. బావిలో రోజుకు రెండు చెట్లకు సరిపడా నీళ్ల ఊరడం లేదు. పరిస్థితి ఇలాగే ఉంటే ఏమి చేయాలో అర్థం కాలేదు. భగవంతుడిపై భారం వేసి ఉన్నాం.

– రమేష్‌బాబు, ఓబుళనాయునిపల్లె

భవన నిర్మాణానికి సహకరిస్తాం

పులివెందుల టౌన్ : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గురువారం పులివెందులలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షుడు రాజు సేవాసమితి నూతన భవన నిర్మాణం సహాయం కొరకు విన్నవించారు. ఈ సందర్భంగా కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సొంత భవన నిర్మాణం కొరకు చేస్తున్న ప్రయత్నాలను వైఎస్ జగన్‌కు వివరించారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ నూతన భవన నిర్మాణం కొరకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించి, భవన నిర్మాణం పూర్తి చేసేందుకు సహకరిస్తామన్నారు. కార్యక్రమంలో ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం వెంకటనారాయణ, సుబ్బారెడ్డి, సేవా సమితి సభ్యులు బండారురాజు, నేత్ర సేకరణ కేంద్రం టెక్నీషియన్ హరీష్, తదితరులు పాల్గొన్నారు.

స్మారక స్తూపం ఆవిష్కరణ

చింతకొమ్మదిన్నె : కడప నగరం విశ్వనాథపురం హిందూ శ్మశాన వాటికలో శుక్రవారం జరిగే కమ్యూనిస్టు పార్టీ నాయకుడు లింగమూర్తి స్మారక స్తూపం ఆవిష్కరణ, బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆర్‌సీపీ మండల కార్యదర్శి ప్రసాద్ కోరారు. ఈ కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, మాజీ హోంమంత్రి మైసూరారెడ్డి, కమ్యూనిస్టు నాయకులు హాజరుకానున్నారన్నారు.

అబద్ధపు హామీలతో అధికారంలోకి చంద్రబాబు

పులివెందుల రూరల్ : రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో అమలు కానీ అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని, ప్రభుత్వంపై రాష్ట్రంలో ప్రజా వ్యతిరేకత చాలా ఉందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్‌కుమార్ రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని స్థానిక భాకరాపురంలోని జగన్ క్యాంపు కార్యాలయంలో ఆయన సాక్షితో మాట్లాడారు. రాష్ట్రంలో విద్యుత్ పవర్ తక్కువకు దొరుకుతుంటే ప్రజలపై భారం మోపడం ఎందుకని చంద్రబాబును ప్రశ్నించారు. చంద్రబాబునాయుడు చెప్పిన హామీలు నెరవేర్చకుండా రోజు రోజుకు విద్యుత్ చార్జీలను ఎందుకు పెంచుతున్నారని దుయ్యబట్టారు. చంద్రబాబు నాయుడు 100 హామీలకుపైగా ఇచ్చి ఒకటి కూడా నెరవేర్చిన పాపాన పోలేదన్నారు. ప్రజలకు అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత చేతులెత్తేశారన్నారు. ప్రజా వ్యతిరేకత కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రభుత్వం చెప్పిన అబద్ధపు హామీలను ప్రజలకు వివరిస్తామన్నారు. జనవరి నెలలో మరో రూ.15వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అలాగే ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు కూడా విద్యార్థులకు ఒక రూపాయి కూడా అందలేదన్నారు. ప్రభుత్వ మాత్రం ఈ విషయంలో ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. జగనన్న అమ్మఒడి పథకం ద్వారా అరులైన ప్రతి ఒక్కరికి రూ.15వేలు చెల్లించారన్నారు. టీడీపీ నాయకులు మాత్రం అధికారంలో వస్తే ఇంట్లో 5 మంది ఉంటే ఐదు మందికి డబ్బులు ఇస్తామని హామీలు ఇచ్చారన్నారు. ఎలక్షన్లు ఎప్పుడు జరిగినా వైఎస్సార్‌సీపీ అధికారం రావడం తథ్యమన్నారు.



సాక్షి మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి

ఆరు నెలల్లోనే ప్రజల మీద రూ.15 వేల కోట్ల భారం వేస్తున్నారు
– ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

ఎన్నికలలో ఇచ్చిన ఏ ఒక్క హామీని చంద్రబాబు నెరవేర్చలేదని.. ఆరు నెలల వ్యవధిలోనే ప్రజల మీద రూ.15వేల కోట్ల భారం వేస్తున్నారని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి తెలిపారు. గురువారం సాక్షి మీడియాతో ఆయన మాట్లాడుతూ మధ్య తరగతి ప్రజల మీద, కుటుంబాలపై విద్యుత్ చార్జీలు పెంచి భారం వేస్తున్నందుకు నిరసనగా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు నేడు శుక్రవారం నిరసన కార్యక్రమానికి ప్రజలు భారీగా తరలి రావాలన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వంపై ప్రజల వ్యతిరేకత ఎక్కువగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అమలు కానీ హామీలు ఇవ్వడంవల్ల ప్రజలు ఆశపడి కూటమి ప్రభుత్వానికి ఓట్లు వేశారన్నారు.

జగన్ జనాదరణ చూసి కూటమి కూసాలు కదులుతున్నాయి
– వైఎస్సార్‌సీపీ నేత రెడ్యం వెంకటసుబ్బారెడ్డి

పులివెందుల రూరల్ : మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎక్కడికి వెళ్లినా వస్తున్న ప్రజాదరణను చూసి కూటమి ప్రభుత్వం కూసాలు కదులుతున్నాయని వైఎస్సార్‌సీపీ నేత రెడ్యం వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. గురువారం సాక్షితో ఆయన మాట్లాడుతూ ఎల్లోమీడియా, కూటమి నాయకులు వైఎస్ జగన్‌పైన అవాకులు, చవాకులు పేలుస్తున్నారన్నారు. వేలాది మంది ప్రజలు వచ్చి జగన్‌ను కలుస్తున్నారన్నారు. ప్రజలందరూ తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకొస్తున్నారన్నారు. వేలాది మంది ప్రజలు వస్తుంటే పోలీసులకు, ప్రజలకు మధ్య తోపులాట జరిగిందని ఎల్లో మీడియా ప్రచారం చేయడం సరికాదన్నారు. జగన్‌ను అడ్డుకోవడానికి కూటమి ప్రభుత్వం నీచ రాజకీయాలకు పాల్పడుతోందన్నారు. జగన్‌ను కలిసేందుకు కడప జిల్లానుంచే కాక అనంతపురం, నెల్లూరు, కర్నూలు, చిత్తూరు జిల్లాల నుంచి కూడా వేలాది మంది అభిమానులు పులివెందులకు వచ్చి ఆయనను కలుస్తున్నారన్నారు. అభిమానులు, కార్యకర్తలు జగన్‌ను కలుస్తుంటే అది చూసి ఓర్వలేక ఎల్లోమీడియా, కూటమి నాయకులు అసత్యపు ప్రచారాలు చేయడం సిగ్గు చేటు అన్నారు. ఇప్పటికైనా నోరు అదుపులో పెట్టుకుని అసత్యపు ప్రచారాలను మానుకోవాలన్నారు.

పోరుబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

పులివెందుల టౌన్/రూరల్ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పెంచిన కరెంట్ చార్జీలకు నిరసనగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పేద ప్రజలకు మద్దతుగా తలపెట్టిన కరెంట్ చార్జీల పెంపుపై వైఎస్సార్‌సీపీ పోరుబాట్ల కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ పార్టీ వర్గాలు తెలిపారు. విద్యుత్ చార్జీల పెంపునకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ పోరుబాట కార్యక్రమం ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతోందని.. ఈ కార్యక్రమం ఈనెల 27వ తేదీన శుక్రవారం ఉదయం 9 గంటలకు స్థానిక పాత ఎమ్మెల్యే ఆఫీస్ నుంచి పాత ఆర్టీసీ బస్‌స్టాండ్ మీదుగా ర్యాలీగా వెళ్లి మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న ఎలక్ట్రికల్ డివిజనల్ అధికారి కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమానికి ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్ మధురెడ్డిలు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, చైర్మన్లు, మాజీ చైర్మన్లు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, మండలాల నాయకులు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, జేసీఎస్ ఇన్‌చార్జిలు, మాజీ డైరెక్టర్లు, వైఎస్సార్‌సీపీ విద్యార్థి, యువజన విభాగపు నాయకులు, మహిళలు, బూత్ కమిటీ కన్వీనర్లు, కుల సంఘాల నాయకులు, వ్యాపార సంఘాల నాయకులు, వైఎస్ కుటుంబ అభిమానులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలన్నారు.

పరామర్శ



రామతులశమ్మను పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి

పెండ్లిమర్రి : మండలంలోని కొత్తగంగిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన ఎంపీటీసీ రామతులశమ్మను గురువారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పరామర్శించారు. రామతులశమ్మ అనారోగ్య కారణంగా ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటి వద్ద విశాంత్రి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న ఆయన ఆమెను పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ జేసీఎస్ కన్వీనర్ అమర్‌నాథ్‌రెడ్డి, నాయకులు సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

చెన్నూరులో..

వల్లూరు (చెన్నూరు) : మండలంలోని కొండపేట గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గ్రామ కన్వీనర్ నరసింహారెడ్డి కుమారుడు నరసారెడ్డి ఇటీవల మరణించడంతో బాధిత కుటుంబాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి పరామర్శించి బాధిత కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు.

పులివెందుల సబ్ జైలును సందర్శించిన జడ్జి

పులివెందుల రూరల్ : పట్టణంలోని లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను గురువారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ జి.శ్రీదేవి సూచనల మేరకు గౌరవ సెక్రటరీ–కం–సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రిజిస్టర్లను పరిశీలించి లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యతను తెలియజేసి మాట్లాడారు. జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయము, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం, ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఆయన జైలు పరిసరాలను, వంట గదులను, వసతి గదులను, టాయిలెట్లను, రిజిస్టర్లను పరిశీలించి తగు సూచనలను సలహాలను ఇచ్చారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబర్ 15100పై ప్రచారం నిర్వహించడం జరిగిందని, ఏదైనా సమస్యలుంటే పులివెందుల మండల న్యాయ సేవా సమితిని, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడపను సంప్రదించవచ్చునన్నారు. కార్యక్రమంలో పులివెందుల సబ్ జైలు సూపరింటెండెంట్, ప్యానల్ న్యాయవాది, పారా లీగల్ వలంటీర్, ఖైదీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గౌరవ సెక్రటరీ–కం–సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్

రసాభాసగా కౌన్సిల్ సమావేశం

ఎర్రగుంట్ల : స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం రసాభాసగా జరిగింది. ఈ సమావేశం మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మహమ్మద్ ఆలీ, నాగిరెడ్డి, ఎరికలరెడ్డిలు, కో ఆప్షన్ సభ్యులు డి.సూర్యనారాయణరెడ్డిలు మాట్లాడుతూ కౌన్సిల్ సమావేశం కేవలం సమోసాలు, టీనీళ్లతో సాగిపోతుందన్నారు. కౌన్సిలర్లు ఆమోదం లేకుండానే కనీసం ఒక్క మాట కూడా చెప్పకుండా అధికారులు ఐదు మంది దినసరి కూలీలను ఏవిధంగా తీసుకున్నారని ప్రశ్నించారు. కౌన్సిల్ ఆమోదం లేకుండా తీసుకోవడం ఏమిటని వారిని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. వార్డులలో సమస్యలను మాతో చర్చించకుండా అజెండాను ఏవిధంగా తయారు చేశారన్నారు. వార్డులలో చాలా సమస్యలు ఉన్నాయని తెలిపారు. పందులు, కుక్కల బెడదను కూడా నియంత్రించలేదన్నారు. బడ్జెట్ అజెండాను పెట్టిన తర్వాత ఏఏ పనులు పెట్టారో మాకు తెలపలేదన్నారు. దీనిబట్టి చూస్తే అధికారులే ప్రజాప్రతినిధులుగా వ్యవహరిస్తున్నారన్నారు. వార్డులలో డ్రైనేజీలు ఏర్పాటు చేయలేదని, రోడ్లు వేయలేదన్నారు. జగనన్న కాలనీలో సుమారు 50 కుటుంబాలు జీవనం సాగిస్తున్నారని వారికి సరైన సదుపాయాలు లేవని రోడ్లు, నీరు కల్పించాలన్నారు. రైల్వేస్టేషన్ నుంచి వై–జంక్షన్ వరకు లైట్లు వేయాలని కోరారు. అధిక లోడ్‌తో వస్తూ ఫ్లైయాష్ బూడిదను రోడ్డుపైన వేసుకుంటు వస్తున్నారని దీని వల్ల చాలా ఇబ్బంది పడుతున్నామన్నారు. వైస్ చైర్మన్ చంద్రకళ మాట్లాడుతూ దినసరి కూలీలను తొలగించాలని మేం చెప్పిన అనుభవం ఉన్న కూలీలను తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ శేషఫణి మాట్లాడుతూ కౌన్సిలర్లు అడిగిన సమస్యలపై సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు జైబున్నీసా, చంద్రకళ, కౌన్సిలర్లు, మున్సిపల్ ఏఈ సురేష్, మెప్మా టీఎంసీ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శేషఫణి

వసతుల కల్పనకు పూర్వ విద్యార్థులు కృషి చేయాలి



శుద్ధినీటి ప్లాంటును ప్రారంభిస్తున్న సూర్యకళావతి

కమలాపురం : ఉన్నత స్థానాల్లో ఉన్న పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాలల్లో వసతుల కల్పనకు కృషి చేసి పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలని వైవీయూ మాజీ వీసీ సూర్యకళావతి, రాష్ట్ర మాజీ విద్యా సలహాదారుడు సాంబశివారెడ్డిలు తెలిపారు. మండలంలోని పెద్దచెప్పలి జడ్పీ హైస్కూల్‌లో పూర్వ విద్యార్థులు దాదిరెడ్డిపల్లెకు చెందిన శ్యాంసుందర్‌రెడ్డి, చంద్రకాంత్‌రెడ్డి, మాధవిలు తమ తండ్రి స్వర్గీయ ఓబులాపురం జనార్ధన్ రెడ్డి జ్ఞాపకార్థం రూ 3.5లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన శుద్ధి నీటి యంత్రాన్ని గురువారం వారు ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు ఈ యంత్రాన్ని చాలా జాగ్రత్తగా వాడుకుని తర్వాత వచ్చే విద్యార్థుల కోసం భద్రంగా ఉంచాలన్నారు. దాతల తండ్రి జనార్ధన్‌రెడ్డి కూడా ఈ పాఠశాల విద్యార్థేనని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో ఎంఈఓ సుభాషిణి, హెచ్‌ఎం ఓబుల్‌రెడ్డి, స్థానిక నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా సీపీఐ శత వార్షికోత్సవాలు

వేంపల్లె : సీపీఐ శత వార్షికోత్సవాల సందర్భంగా వేంపల్లెలో జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి సీపీఐ జిల్లా కార్యదర్శి పి.సుబ్రహ్మణ్యం, పులివెందుల ఏరియా కార్యదర్శి వెంకటరాములు హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అబద్ధపు హామీలతో గద్దెనెక్కి రాష్ట్రంలోని రైతులను, విద్యార్థులను, సంపన్న వర్గాలను మోసం చేస్తోందన్నారు. రైతులకు అందిస్తామని చెప్పిన పెట్టుబడి సహాయం రూ.20 వేలు ఇవ్వకుండా రైతులను ఆందోళనకు గురిచేస్తోందని, కరెంటు చార్జీలు రూ.15,484 కోట్ల రూపాయలు ప్రజలపై భారం వేస్తోందన్నారు. విద్యుత్ చార్జీల భారాన్ని ఉపసంహరించుకునేంతవరకు కమ్యూనిస్టు పార్టీ జనవరి మాసంలో సమ్మెను ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో పులివెందుల ఏరియా సహాయ కార్యదర్శి కొత్త కాల్వ బ్రహ్మం, బీకేఎంయూ కడప జిల్లా కార్యవర్గ సభ్యులు మల్లికార్జున, సీపీఐ వేముల మండల కార్యదర్శి ఎస్ చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



సీపీఐ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : భారత కమ్యూనిస్టు పార్టీ మండల సమితి ఆధ్వర్యంలో సీపీఐ శత వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సీపీఐ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఎంవీ సుబ్బారెడ్డి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మంజుల, జిల్లా ఉపాధ్యక్షుడు చాంద్‌బాషా, ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షుడు రమేష్, మండల కార్యదర్శి భవాని శంకర్, సహాయ కార్యదర్శి ఎం. నారాయణ పాల్గొన్నారు.

దివ్యాంగులకు బ్యాగ్‌ల వితరణ

పులివెందుల టౌన్ : దివంగత వంగవీటి మోహన రంగా 36వ వర్ధంతిని పురస్కరించుకుని పట్టణంలోని వికలాంగుల కమ్యూనిటీ భవనంలో గురువారం అమ్మ సేవాసమితి అధ్యక్షుడు రమేష్‌బాబు ఆధ్వర్యంలో సంస్మరణ సభ నిర్వహించారు. అనంతరం శ్రీకృష్ణదేవరాయలు, వంగవీటి మోహనరంగా చిత్రపటాలకు ఘన నివాళులర్పించారు. అనంతరం లగేజీ బ్యాగులను 30 మంది దివ్యాంగులకు పంపిణీ చేసి దివ్యాంగులకు అన్నదానం నిర్వహించారు. దివ్యాంగుల శిక్షణ కేంద్రానికి బలిజ, కాపు సంక్షేమ సంఘ జిల్లా కన్వీనర్, ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ రమణ రూ.20వేల ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో కాపునాడు రాష్ట్ర నాయకులు నాగేశ్వరరావు, కాపునాడు జిల్లా అధ్యక్షుడు సమతం రాము, పులివెందుల బలిజసంఘం అధ్యక్షుడు గూడూరు గురుప్రసాద్, వికలాంగుల నెట్ వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి, సంఘ కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



లగేజీ బ్యాగ్‌లను అందిస్తున్న పూల రమేష్

మేలైన విత్తన రకాలను ఎంపిక చేసుకోవాలి

కమలాపురం : రైతులు పంటల సాగుకు ముందే మేలైన విత్తన రకాలను ఎంపిక చేసుకోవాలని మండల ఏఓ సరస్వతి తెలిపారు. గురువారం మండలంలోని దాదిరెడ్డిపల్లె, అప్పారావుపల్లె గ్రామాలలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పంట పొలాలను పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేరుశనగలో సూక్ష్మ ధాతు లోప నివారణకు సూక్ష్మ ధాతు మిశ్రమ ఎరువులైన ఫార్ములా 4 లేదా, గ్రోత్ లేదా మ్యాక్స్ ఏకరాకు కిలో మిశ్రమాన్ని పంట వేసిన 30–40, 60–70 రోజులకు పిచికారి చేయాలన్నారు. ప్రతి మూడు పంటలకు 20 కిలోల జింక్ సల్ఫేట్, 200 కిలోల జిప్సంను పొలంలో వేసుకోవాలన్నారు. పంట విత్తిన 40–50 రోజుల మధ్య ఏకరానికి 200 కిలోల జిప్సం చల్లాలన్నారు. ఆకుమచ్చ తెగులు గుర్తించిన తక్షణం ఏకరాకు 400 గ్రాముల మంకోజెబ్ లేదా 200 గ్రాముల కార్బన్డిజం లేదా హెక్సాకోనోజోల్ 5 శాతం 400 మి.మీ.లు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. లద్ధె పురుగు, శగన పచ్చ పురుగు నివారణకు ఏకరాకు 4 లింగా కర్షక బుట్టలు పెట్టి మగ రెక్కల పురుగు ఉధృతిని తగ్గించాలన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



దాదిరెడ్డిపల్లెలో పంటలను పరిశీలిస్తున్న ఏఓ సరస్వతి